సాక్షి గుంటూరు

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



బగళాముఖి సేవలో జిల్లా జడ్జి

పిట్టలవానిపాలెం: చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖ అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని గుంటూరు జిల్లా జడ్జి చింతాడ రాజగోపాల్ శనివారం దర్శించుకున్నారు.



తిరుపతమ్మ తల్లి జ్యోతి ఊరేగింపు

దాచేపల్లి: శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి జ్యోతి ఊరేగింపు శనివారం నిర్వహించారు. మాలధారులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.



కొవ్వొత్తులతో ప్రదక్షిణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై కొలువై ఉన్న కార్మెల్‌మాతను పదోతరగతి విద్యార్థులు శనివారం సందర్శించారు. కొవ్వొత్తులతో ప్రదక్షిణ చేశారు.

న్యూస్‌రీల్

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

తాడికొండ: నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో ఆదివారం అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు నిర్మాణ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. కులమతాలు, పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరింది.

సార్వత్రిక ఎన్నికలకు సర్వ సన్నాహాలు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి శనివారం చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో పెద్ది రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన ఓటర్ల అభ్యంతరాలు, క్లెయిమ్స్, సూచనలు, సలహాల్ని నిర్దిష్టమైన విధానాలతో పరిశీలించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌ల వద్ద భద్రత, మౌలిక సదుపాయాలు, వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ తదితర అంశాలు పూర్తి చేస్తున్నామని చెప్పారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ సిబ్బంది వివరాలను నిర్దేశించిన ఫార్మెట్‌లో అందజేస్తామని చెప్పారు. దీంతోపాటు వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో నిరంతరం సంప్రదిస్తున్నామని, వారిచ్చే సూచనలు, సలహాల్ని స్వీకరిస్తున్నామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీ కుమారి, ఆర్డీఓ పి.శ్రీకర్, పాల్గొన్నారు.

ప్రతిపక్షాల శవ రాజకీయం

- టీడీపీ హయాంలోనే డయేరియా విజృంభణ, అప్పట్లో 24 మంది మృతి
- మంత్రి విడదల రజిని ధ్వజం
- ఆస్పత్రిలో బాధితులకు పరామర్శ

గుంటూరు మెడికల్ : ప్రతిపక్షాలు శవ రాజకీయాలు చేస్తున్నాయనేదానికి నిదర్శనం శనివారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన సంఘటన అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ధ్వజమెత్తారు. 2018లో టీడీపీ ప్రభుత్వంలో గుంటూరు నగరంలో పది ప్రాంతాల్లో డయేరియా వచ్చిందని తెలిపారు. అప్పుడు 2,400 మంది దాని బారిన పడ్డారని, 24 మంది చనిపోయారని చెప్పారు. ఈ విషయంలో గుంటూరు ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఆనాటి టీడీపీ ప్రభుత్వం బాధ్యత లేనిదని, తాము బాధ్యత గల ప్రభుత్వంగా తక్షణమే స్పందించి బాధితులకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. నగరంలో నాలుగు ప్రాంతాల్లో ఒక్కో ప్రాంతం నుంచి ఇద్దరు చొప్పున వాంతులు, విరేచనాలతో జీజీహెచ్‌కు చికిత్స కోసం వచ్చారని తెలిపారు. డయేరియా అంటే ఎక్కువ సంఖ్యలో బాధితులు ఉంటారని, ఒక వీధి మొత్తం కేసులు వస్తాయని చెప్పారు. టీడీపీ నేతలు కేవలం కొద్ది సంఖ్యలో వచ్చిన బాధితుల్ని శవ రాజకీయాల కోసం వాడుతున్నారని విమర్శించారు. మంత్రి విడదల రజిని శనివారం రాత్రి గుంటూరు జీజీహెచ్‌లో వాంతులు, విరేచనాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.



జీజీహెచ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

రౌడీయిజంపై ధ్వజం

బాధ్యత గల మంత్రిగా చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు ఆసుపత్రికి వచ్చిన తనపై ఆసుపత్రిలో ఉన్న ప్రతిపక్షాలు రౌడీయిజం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దీన్ని మీడియా అంతా చూశారని, ఇది ఎంత వరకు సబబని ? ఆమె ప్రశ్నించారు. మంత్రి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఉన్నారు.

వైద్య సేవలు బాగున్నాయి

మంత్రి మీడియాతో మాట్లాడుతూ చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడానని, వైద్య సేవలు బాగున్నాయని, బాధితులు కూడా చెబుతున్నట్లు వెల్లడించారు. జీజీహెచ్‌లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రి సూపరింటెండెంట్ అప్రమత్తంగా ఉండి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి ఈసంఘటనపై పూర్తి స్థాయి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. వాంతులు, విరేచనాలు అవ్వడానికి కారణాలు తెలుసుకోవడానికి ఫుడ్, వాటర్ శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేస్తున్నారని, ఫలితాలు వచ్చేంత వరకు పూర్తిగా కారణాలు తెలియదని చెప్పారు. పరీక్షా ఫలితాలు వచ్చాక ఏ కారణాల వల్ల వాంతులు, విరేచనాలు అయ్యాయో తెలుసుకుని వాటి కట్టడికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం బాధ్యతతో పూర్తి స్థాయిలో బాధితులకు చికిత్సలు చేయిస్తుందని, నీటి క్లోరినేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతున్నట్లు వెల్లడించారు. డయేరియా లాంటి లక్షణాలు ఉండటం వల్ల వైద్యులు సంబంధిత చికిత్సలు అందిస్తున్నారని తెలిపారు.



బాధితుడిని పరామర్శిస్తున్న మంత్రి రజిని

మంత్రి కారు ముట్టడి

మంత్రి విడదల రజిని గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు వస్తున్న విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు ఆసుపత్రిలోనే వేచి ఉండి మంత్రి కారు గేటు లోపలకు రాగానే ముట్టడించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోగులను పరామర్శించే సమయంలో సైతం నినాదాలు చేస్తూనే ఉన్నారు. రోగులను పరామర్శించి తిరిగి కారు ఎక్కే సమయంలో సైతం మంత్రిని అడ్డగిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ నేతలు నినాదాలు చేశారు. పోలీసులు వారిస్తున్నప్పటికీ వారు వినకపోవడంతో మంత్రి సైతం తీవ్ర స్వరంతో వాగ్వాదం చేశారు.



మంత్రి విడదల రజినితో వాగ్వాదం చేస్తున్న బీజేపీ నాయకులు

అప్రమత్తంగా ఉన్నాం

- కలెక్టర్ వేణుగోపాల రెడ్డి
- ఇంటింటి సర్వే
- డీఎంహెచ్ఓ కార్యాలయంలో కంట్రోల్ రూం (ఫోన్ నంబర్ : 6300115327)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరులో పలువురు వాంతులు విరేచనాలతో ఆసుపత్రిలో చేరిన ఘటనపై జిల్లా కలెక్టర్ స్పందించారు. ఆయన వెంటనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అనంతరం ఆయన సాక్షితో మాట్లాడారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని తెలిపారు. మొత్తం 22 మంది శనివారం ఆసుపత్రిలో చేరారని, అందులో ఎనిమిది మంది జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చారని చెప్పారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 14 మంది మాత్రమే వచ్చారని వివరించారు. వీరంతా శారదాకాలనీ, శ్రీనగర్, నెహ్రూనగర్, మధురానగర్, సంగడిగుంట, నల్లచెరువు, సంపత్‌నగర్ ప్రాంతాల నుంచి వచ్చినట్లు గుర్తించామని చెప్పారు. నీటి కాలుష్యం ఉందా లేదా తెలుసుకొనేందుకు బాధితులు ఇంటి వద్ద నుంచి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపినట్లు పేర్కొన్నారు. ఫలితాలు వచ్చే వరకూ ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. నీరు కలుషితం అయ్యిందా.. లేదా అని తేలిన తర్వాతే మిగిలిన చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో వైద్య బృందాల ద్వారా ఇంటింటి సర్వే ప్రారంభించాయని, ఎవరికైనా ఇటువంటి లక్షణాలు ఉంటే వెంటనే వారికి చికిత్స అందిస్తామని కలెక్టర్ చెప్పారు. బాధితుల ఇంటి నుంచి ఫుడ్ శాంపిల్స్ కూడా సేకరించి పరీక్షలకు పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

వాలిన రాబందులు

- యువతి మృతిపై రాజకీయ లబ్ధి కోసం టీడీపీ నేతల ప్రయత్నం
- జీజీహెచ్ చుట్టూ ప్రదక్షిణలు
- విపక్షాల తీరు నవ్వులపాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అనారోగ్యంతో మృతి చెందిన శారదా కాలనీకి చెందిన పద్మ మరణాన్ని రాజకీయం చేయాలని టీడీపీ, జనసేన, వామపక్షాల నేతలు జీజీహెచ్ వద్ద హడావుడి చేశారు. మూడు రోజులుగా అనారోగ్యంతో ఆర్ఎంపీ వద్ద వైద్యం పొందిన పద్మ(18) పరిస్థితి సీరియస్‌గా మారడంతో శనివారం ఉదయం ప్రభుత్వాసుపత్రికి తీసుకరాగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. వాంతులు, విరోచనాల కారణంగా నీరసించిన పద్మ హార్ట్ ఎటాక్‌తో చనిపోయిందని వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, అదే సమయంలో ప్రభుత్వాసుపత్రికి వాంతులు, విరోచనాలతో పదిమందికి పైగా వైద్యం కోసం రావడంతో దీన్ని రాజకీయం చేయడం కోసం రాబందుల్లా ప్రతిపక్ష నేతలు వాలిపోయారు. చికిత్స పొందుతున్న బాధితులను లేపి మరీ తాగు నీటి వల్లే ఇలా జరిగింది అని చెప్పించే ప్రయత్నం చేశారు. చికిత్స పొందుతున్న వారిని పరామర్శించేందుకు జీజీహెచ్‌కు వచ్చిన నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. కమిషనర్, మేయర్, ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. రోగులకు చికిత్స అందించే వీలు లేకుండా ఎమర్జెన్సీ వార్డులో చొరబడి నానా యాగీ చేశారు.

నసీర్ అహ్మద్ ఓవరాక్షన్

తూర్పు నియోజకవర్గ తెలుగుదేశం నేత నసీర్ అహ్మద్ ఓవరాక్షన్ విమర్శలకు దారితీసింది. కొంతకాలంగా ప్రజల్లో పలుకుబడి సంపాదించుకునేందుకు ఆయన గుంటూరు జీజీహెచ్‌ను వేదికగా చేసుకుని శవ రాజకీయాలు చేస్తున్నారు. శనివారం మరణించిన పద్మ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు క్యాజువాల్టీ నుంచి స్ట్రక్చర్‌పై బయటకు తీసుకొచ్చారు. సరిగ్గా అదే సమయంలో జీజీహెచ్‌కు చేరుకున్న నసీర్ అహ్మద్ రాజకీయం చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. వీల్ చైర్‌ను తీసుకెళ్లకుండా క్యాజువాల్టీ ముందే నిలిపి మీడియాను పిలిచి హడావుడి చేశాడు. నీటి కాలుష్యం వల్లే యువతి మృతిచెందిందంటూ ఆరోపణలు చేస్తూ, పోస్టుమార్టం చేయాలంటూ డిమాండ్ చేశారు. యువతి కుటుంబ సభ్యులు అంగీకరించకపోయినా బలవంతంగా వారిని ఒప్పించే ప్రయత్నం చేశారు. పోస్టుమార్టం చేయిస్తే డబ్బులు వస్తాయంటూ మభ్యపెట్టి, మృతదేహంతో మీడియా ముందు హడావుడి చేశారు.



మేయర్ కావటితో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకుడు నసీర్

గతంలోనూ ఇదే తీరు

గుంటూరు జీజీహెచ్ క్యాజువాల్టీలో ప్రతిరోజూ ఇరువురు లేదా ముగ్గురు తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతూ, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతూ చనిపోవడం సహజం. మృతదేహాలను మార్చురీకి తరలించి పోస్టుమార్టం చేయించేందుకు కావాల్సిన డాక్యుమెంటేషన్ సిద్ధం చేసేందుకు కొంతసేపు క్యాజువాల్టీలోనే ఉంచుతారు. ఈ సమయంలో సుమారు మూడు నెలల కిందట నజీర్ అహ్మద్ క్యాజువాల్టీకి వెళ్లి అక్కడ ఉన్న మూడు మృతదేహాలను చూసి శవరాజకీయం చేశారు. ఆసుపత్రిలో గుట్టలుగుట్టలుగా మృతదేహాలు పడి ఉన్నాయంటూ సోషల్ మీడియా ద్వారా సమాచారాన్ని చేరవేసి హల్‌చల్ చేశారు. తీరా ఆసుపత్రి అధికారులు సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ఆరోపణల్ని ఖండిస్తూ జరిగిన విషయాలను మీడియా ద్వారా వెల్లడించారు. మళ్లీ శనివారం ఇదే తరహా శవ రాజకీయాలకు దిగడాన్ని పలువురు తప్పుపట్టారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడి వారికి నూతన జీవితాల్ని ప్రసాదిస్తున్న ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, అధికారుల మనోధైర్యాల్ని సైతం దెబ్బతీసేలా టీడీపీ నేతల శవ రాజకీయాలు చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

నిలకడగా బాధితుల ఆరోగ్యం

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. శనివారం జ్వరం, కడుపునొప్పి, లూజు మోషన్స్, వాంతులతో సుమారు 20 మంది పలు ప్రాంతాలకు చెందిన వారు చికిత్స కోసం వచ్చారన్నారు. గుంటూరు శారదాకాలనీకి చెందిన 17 సంవత్సరాల మద్దెల పద్మ తీవ్ర అస్వస్థతతో చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చారన్నారు. మూడు రోజులుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ తమ వద్దకు వచ్చారని, చికిత్స పొందుతూ మృతి చెందిందని వెల్లడించారు. మధ్యాహ్నం నుంచి బాధితులు ఎవరూ ఆసుపత్రికి రాలేదని, అందరూ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. మృతి చెందిన యువతి కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు పోస్టుమార్టం చేయిస్తున్నామని చెప్పారు. బాధితులకు చికిత్స అందించేందుకు జీజీహెచ్‌లో 20 మంది వైద్యులు, జూనియర్ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందిస్తూ కంటికి రెప్పలా కాపాడుతున్నారని వెల్లడించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 20 మందిలో ఏడుగురు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. గుంటూరులోని శ్రీనగర్, నెహ్రూనగర్, సంగడిగుంట, మధునగర్, శారదాకాలనీ, నల్లచెరువు, సంపత్‌నగర్ ప్రాంతాల వారు 13 మంది చికిత్స పొందుతున్నారు.



బాధితులకు సేవలు అందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

మరియమాత దర్శనం.. సర్వపాప హరణం



ప్రార్థనలు చేస్తున్న బిషప్ విజయ్ కుమార్, బిషప్ రాజారావు తదితరులు

గుణదల (విజయవాడ తూర్పు): అమ్మా దర్శనం.. మరియమ్మా దర్శనం.. అంటూ భక్తుల శరణు ఘోషతో మేరీమాత పుణ్యక్షేత్రం మారుమోగింది. గుణదల క్షేత్రంలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలకు అనేక రాష్ట్రాల నుంచి క్రీస్తు విశ్వాసులు లక్షలాదిగా తరలి వస్తున్నారు. ఏ దిక్కున చూసినా మరియమాత భక్తులే కనిపిస్తున్నారు. గుణదల మరియమాత ఉత్సవాల రెండో రోజైన శనివారం బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణంలో జరిగిన సమష్టి దివ్యబలి పూజకు శ్రీకాకుళం మేత్రాసన బిషప్ రాయరాల విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు సందేశం ఇచ్చారు. లోక రక్షకుడైన ఏసు క్రీస్తును ఈ లోకానికి అందించిన మరియమాత పరమ పవిత్రురాలని కొనియాడారు. ఆమె పవిత్రతకు మెచ్చి సాక్షాత్తూ దేవాది దేవుడే మానవ రూపంలో జన్మించారని పేర్కొన్నారు. ఏసు నామంలో జీవిస్తున్న మనం మరియతల్లిని ఎల్లప్పుడూ మననం చేసుకోవాలని సూచించారు.

అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, మోన్సిగోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, సోషల్ సర్వీస్ సెంటర్ ఫాదర్ సునీల్‌రాజు తదితర గురువులు, మఠకన్యలు, వేలాది మంది విశ్వాసులు పాల్గొన్నారు.

తాగునీరు శుద్ధం..ఆరోపణలు అబద్ధం

- నగర మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి
- తాగునీటి కారణంగా డయేరియా కేసులు నమోదు కాలేదు
- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారికి పరామర్శ


జీజీహెచ్‌లో బాధితురాలిని పరామర్శిస్తున్న మేయర్, కమిషనర్ తదితరులు

నెహ్రూనగర్: గుంటూరు నగర ప్రజలు తాగునీటి సరఫరాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నగర మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. తగు పాళల్లో క్లోరిన్ శాతం ఉందని, ఎక్కడా కలుషిత నీరు సరఫరా కావడం లేదని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణలో శుద్ధమైన తాగునీటిని నగర ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం శారదా కాలనీ, శ్రీనగర్ ప్రాంతాలతో పాటు జిల్లాలో ఇతర ప్రాంతాలకు చెందిన 20 మంది అనారోగ్యానికి గురయ్యారని తెలిసిన వెంటనే నగర మేయర్, కమిషనర్, డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శారద కాలనీ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో, జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 20 మంది బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. మూడు రోజుల కిందట సంగడిగుంట తిరుమలచారి కాలనీలో జరిగిన సంఘటనపై తక్షణం స్పందించి నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పరిసర ప్రాంతాల్లో డోర్ టు డోర్ తాగునీటి నమూనా, క్లోరిన్ పరీక్షలను ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని రీజినల్ ల్యాబ్‌లో పరీక్షించినట్లు చెప్పారు.

డయేరియాతో మృతి చెందలేదు

శనివారం మృతి చెందిన శారదా కాలనీకి చెందిన పద్మ (18ఏళ్లు) ప్రాథమిక విచారణలో డయేరియా వల్ల మృతి చెందలేదని తెలిసిందని, పోస్ట్‌మార్టం కూడా చేపట్టాలని ఆదేశించామని నగర మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని, అనారోగ్య లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బాధితులకు జీజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందేలా నగరపాలక సంస్థ సీఎంఓహెచ్ డాక్టర్ ఆషాని, శారదా కాలనీలో క్షేత్రస్థాయిలో మెడికల్ సర్వే, వైద్య పరీక్షలు పర్యవేక్షణ చేయాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు నగరంలోని ప్రతి రిజర్వాయర్ పరిధిలో తాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటీ కార్యదర్శుల ద్వారా ఫస్ట్ పాయింట్ నుంచి టెయిల్ ఎండ్ పాయింట్ వరకు క్లోరిన్ శాంపిల్స్ సేకరించాలని తెలిపారు.

తాగునీటి వలన డయేరియా రాలేదు

తాగునీటి వల్ల డయేరియా వస్తే ఆ ప్రాంతమంతా బాధితులు పెరిగిపోయేవారని కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు. శారదా కాలనీలో పద్మ కుటుంబ సభ్యులను పరామర్శించామని, వారంతా ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. ఆ ప్రాంత పరిసర ప్రాంతాల్లో చిన్నారులు కూడా ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ఎక్కడా నీరు కలుషితం కాలేదని ఆమె స్పష్టం చేశారు.

దళిత కవిత్వ తాత్వికతకు మేనిఫెస్టో 'మద్దూరి'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మద్దూరి విజయశ్రీ

పాత గుంటూరు: దళిత కవిత్వ తాత్వికతకు మేనిఫెస్టో మద్దూరి నగేష్ బాబు కవిత్వం అని ప్రముఖ రచయిత, విమర్శకుడు గుంటూరు లక్ష్మీ నరసయ్య అన్నారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో శనివారం బహుజన కెరటాలు ఆధ్వర్యంలో ప్రచురించిన మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ సభ నిర్వహించారు. సభకు ప్రముఖ రచయిత డాక్టర్ కోయి కోటేశ్వర రావు అధ్యక్షత వహించారు. లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ మద్దూరి కవిత్వంలో దళిత వాస్తవికత గోచరిస్తుందన్నారు. మద్దూరి నగేష్‌బాబు సతీమణి, తహశీల్దార్ విజయశ్రీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, రచయితలు శిఖామణి, ఖాజా, ఎం.ఎం.వినోదిని, నూకతోటి రవికుమార్, కాకాని సుధాకర్, జీవీ రత్నాకర్, అనిల్ డ్యాని, తంగిరాల సోని, శ్రీనివాస గౌడ్, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య ప్రసంగించారు.

రేపూడిలో సీఎం సభాస్థలి పరిశీలన



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామశివారులో ఈనెల 15 నిర్వహించ తలపెట్టిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రానున్నారు. కాగా సభ నిర్వహించే స్థలాన్ని శనివారం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు పరిశీలించారు. స్థలంలో పారిశుధ్య మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలు, తాగునీటి సౌకర్యం, వాహనాలు నిలుపుదల చేసే విధానం గురించి అధికారులతో చర్చించారు. తీసుకోవాల్సిన భద్రతా చర్యలు వివరించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ సభను అందరూ జయప్రదం చేయాలని కోరారు. ఆయన వెంట డీఎల్‌డీవో సుజాత, ఆర్డీవో శ్రీకర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజారమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఏ ఫలితాల్లో 'మాస్టర్ మైండ్స్' విజయకేతనం



గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఈనెల 7న ప్రకటించిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్తీర్ణులయ్యారని సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో శనివారం మోహన్ మాట్లాడుతూ తమ విద్యార్థిని ఎ. హిమబిందు 400 మార్కులకు గాను 347 సాధించి, అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు వివరించారు. మాస్టర్‌మైండ్స్ నుంచి 400 మార్కులకు గాను 300 ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు 36 మంది ఉన్నారన్నారు. సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో వెయ్యి మంది మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అత్యుత్తమ బోధనా విధానం, క్రమశిక్షణ విద్యార్థుల విజయానికి కారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



గుంటూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని నల్లపాడు పోలీసు స్టేషన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాంబాబు కథనం ప్రకారం నగర శివారులోని ఎన్‌హెచ్-16 బుడంపాడు హైవే సమీపంలో అక్రమంగా మహారాష్ట్రకు చెందిన లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామన్నారు. లారీలో అక్రమంగా తరలిస్తున్న 834 బస్తాలు (రూ. 8.50 లక్షల విలువ కలిగినవి) స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. తాళ్లూరి సీతయ్యతో పాటు, మరో ఇరువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు.

ఏటుకూరులో మహిళ దారుణ హత్య



గుంటూరు రూరల్: గుర్తుతెలియని మహిళ హత్యకు గురైన సంఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు శివారు పొలాల్లో గుర్తుతెలియని సుమారు 30 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళ హత్యకు గురైందన్న సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్నామని పోలీసులు తెలిపారు. మహిళ ముఖంపై విచక్షణారహితంగా రాయితో దాడిచేయడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి చేతిపై దుర్గ అని పచ్చబొట్టు ఉందన్నారు. మృతురాలు ఎర్ర పంజాబీ డ్రస్సు ధరించి ఉందన్నారు. నమ్మించి.. తీసుకొచ్చి ఇక్కడ హతమార్చారా? లేక వివాహేతర సంబంధమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాంబాబు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు నల్లపాడు పోలీసులను సంప్రదించాలన్నారు.